ఇంజనీర్లనే ఇలవేల్పులుగా భావించి ధూప, దీప, నైవేద్యాలతో ప్రసన్నం చేసుకోవడములో అతనికతడే సాటి. ఒక్కముక్కలో చెప్పాలంటే కోటికి పడగెత్తాడు. నాల్గు చేతుల సంపాదన, ఐదంతస్తుల మేడ కట్టించాడు. ఇంద్రభవనంలాంటి మేడ. పార్వతమ్మ మెడనిండా పసిడి గలగలలు. ఆ పాలరాతి మేడలో అదేపనిగా తర్కించి, చర్చించిన దంపతులు తమ ఒక్కగానొక్క కూతురుకు అమెరికా అల్లుణ్ణి సంపాదించితీరాలని ఏక గ్రీవంగా తీర్మానించుకున్నారు.

ఏకగ్రీవతీర్మానం ఏకంగా - నాగభూషణం ఏకైక బాల్యస్నేహి తుడు మహాలింగం చెవిలో పడిపోయింది. మహాలింగంది మహాబుర్ర. దుష్టరాజకీయాల్లో తలపండిన సీనియర్ నాయకుడిలా అది స్పందించింది. అతని వేలువిడిచిన మేనబావొకడు ఎప్పుడో అమెరికాలో సెటిలైన సంగతీ, ఆ మేనబావకో కొడుకున్నాడన్న సంగతీ అర్జెంటుగా గుర్తు కొచ్చింది.

ఆలస్యమైతే అమృతం గూడా విషమై కూచుంటుంది గదా! యమ ర్జెంట్‌గా అమెరికాకు యస్టీడీ కొట్టేశాడు. కొడుక్కు ఇండియా సంబంధం దొరికితే, ఇల్లూవాకిలి విడిచిపెట్టి పరుగెత్తాలనుకున్న మేనబావ సంతోషం పట్టలేక ఎగిరి గంతేస్తున్నానన్నాడు. తన జబ్బ తానే చరుచుకుని ఫోన్ జారవిడిచాడు. అతని కొడుకే ఫోనందుకుని -

"డియర్ మామ్యా! హౌ ఈజ్ దట్ పోరీ?" అడిగాడు - నుడి కారాన్ని మేళవించి.

"పోరికేందిరా మేనల్లుడా! పోరంబోకు తోటలోని నిమ్మపండు రంగూ, దొండపండు పెదాలూ, దానిమ్మ గింజల్లాంటి పలు వరుసా.... నాగుబామంత జడా...."

